ప్లాస్టిక్ అత్యంత ప్రమాదకరం



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



ప్లాస్టిక్ భూతానికి వ్యతిరేకంగా విద్యార్థుల ప్రదర్శనలు

● ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి

కందుకూరు అర్బన్: మానవాళి మనుగడకు ప్లాస్టిక్ భూతం అత్యంత ప్రమాదకరమని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛసర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛతా ర్యాలీని మున్సిపాలిటీ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని సచివాయం ఉద్యోగులు, వార్డు వలంటీర్లు, మెప్మా మహిళలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ప్లాస్టిక్ భూతానికి వ్యతిరేకంగా వివిధ వేషధారణలు వేయగా వారితో కలసి ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ర్యాలీ పోస్టాఫీస్ సెంటర్, పామూరురోడ్డు, ప్రభుత్వ ఏరియా వైద్యశాల, అంకమ్మతల్లి దేవాలయం సెంటరు మీదుగా తిరిగి మున్సిపాలిటీ కార్యాలయానికి చేరింది. ర్యాలీ క్రమంలో ఎమ్మెల్యే షాపుల వద్దకు వెళ్లి ప్లాస్టిక్‌ను నిషేధించాలని కరపత్రాలను అందజేశారు. అందరం కలిసి ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదామని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు ప్లాస్టిక్ రహిత వాటర్ (స్టీల్ బాటిల్స్)ను అందజేశారు. తహసీల్దార్ సీతారామయ్య, కమిషనర్ ఎస్. మనోహర్, సీఐ వెంకట్రావు, ఎస్సై కిషోర్‌బాబు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



ఏలూరుపాడులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

గుడ్లూరు: లబ్ధిదారులు గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా మైన్స్ అధికారి సూర్యచంద్రరావు అన్నారు. మండలంలోని చేవూరు, ఏలూరుపాడు, తెట్టు గ్రామాల్లో జగనన్న కాలనీల్లో నిర్మాణాల్లో ఉన్న గృహాలను ఆయన శనివారం పరిశీలించారు. లబ్ధిదారులతో సమావేశమై ఏ మేరకు నిర్మాణ పనులు జరిగాయో వారిని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు మెటీరియల్ పూర్తి స్థాయిలో అందుతున్నందున నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. మూడు గ్రామాల్లో 370 గృహాలను నిర్మిస్తుండగా వాటిలో 170 గృహాలు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఉగాది నాటికి గృహ ప్రవేశాలు జరిగేలా లబ్ధిదారులంతా ఇళ్ల నిర్మాణాలు పూర్త చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఏఈ వెంకటేశ్వర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్ దేవకుమారిలు ఉన్నారు.

32 మందికి వైద్య పరీక్షలు

సింగరాయకొండ: మండలంలోని శానంపూడి గ్రామ సచివాలయం వద్ద శనివారం నిర్వహించిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ కార్యక్రమంలో 32 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ చైతన్య కృష్ణ తెలిపారు. ఆరోగ్య పర్యవేక్షకులు సయ్యద్ మసూద్ అలీ, ఏఎన్ఎం సాయిశ్రీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దత్తాత్రేయస్వామిని దర్శించుకున్న జిల్లా జడ్జి



దత్తాత్రేయ స్వామిని దర్శించుకుంటున్న జడ్జి భారతి

లింగసముద్రం: మొగిలిచర్లలోని దత్తాత్రేయ స్వామి మందిరాన్ని ప్రకాశం జిల్లా జడ్జి భారతి శనివారం ఉదయం 11 గంటలకు దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ జడ్జిని సాదరంగా ఆహ్వానించి, ఆలయ విశిష్టతను, దత్తాత్రేయస్వామి చరిత్ర గురించి వివరించారు. జడ్జి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వ్యవస్థాపక ధర్మకర్త జడ్జి భారతికి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మాలకొండ వెళ్లి మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు.

చెత్త నుంచి సంపదతో పంచాయతీల అభివృద్ధి

జరుగుమల్లి (సింగరాయకొండ): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయడం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని ఎంపీడీఓ పి. రామకృష్ణ అన్నారు. జరుగుమల్లి మండలంలోని దావగూడూరు, చింతల పాలెం గ్రామాలకు చెందిన సంపద తయారీ కేంద్రాలను శనివారం తనిఖీ చేశారు. చెత్త ద్వారా వర్మీ కంపోస్టు ఎరువు తయారీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

వైభవంగా కుసుమ హరనాథ్ బాబా కల్యాణోత్సవం

సింగరాయకొండ: స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని శ్రీ కుసుమ హరనాథ్ బాబా ఆలయంలో శనివారం రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కుసుమ హరనాథ్‌బాబాకు అత్యంత వైభవంగా కల్యాణోత్సవ కార్యక్రమం, అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భజన బృందం వారిచే భక్తి గీతాలు ఆలపించారు.

అతి వేగంతోనే రోడ్డు ప్రమాదాలు



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, ప్రజలు

సీఎస్‌పురం: అతి వేగమే రోడ్డు ప్రమాదాలకు కారణమని ఎస్సై పి.అనీల్‌కుమార్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఎస్ పురం లో మోటార్ సైకిల్‌పై ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మాట్లాడుతూ అతివేగం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్లే రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీటుబెల్ట్ పెట్టుకోవాలని సూచించారు.

టోల్ ప్లాజా వద్ద బారులు తీరిన వాహనాలు

టంగుటూరు: స్థానిక టంగుటూరు టోల్ ప్లాజాలో ఫాస్టాగ్ సర్వర్ సమస్య 10 నిమిషాలు పాటు తలెత్తటంతో శనివారం వాహనాలు బారులు తీరాయి. కేంద్ర ప్రభుత్వం నిబంధనలు ప్రకారం రెండు నిమిషాలు దాటితే టోల్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు, కానీ 10 నిమిషాలు పైన వాహనాలు నిలిచినా టోల్ ప్లాజా వారి టోల్ ఫీజు వసూలు చేశారు. గతంలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నా ఫాస్టాగ్ సర్వర్ సమస్య పరిష్కరించటం లేదని వాహనదారులు తెలిపారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు



రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



రథ సప్తమి వేడుకల్లో ఆలయ కమిటీ

సీఎస్‌పురం: రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణ స్వామికి పూజలు చేసి శ్రీదేవి భూదేవి సమేత విష్ణుమూర్తి, నారాయణస్వామి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి ఆలయం చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, ముడుమాల నారాయణరెడ్డి పర్యవేక్షణలో రథ సప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అయ్యలూరివారిపల్లి సమీపంలోని తిరుమలకొండ తిరుమలనాథ స్వామి ఆలయంలో శనివారం రథ సప్తమి వేడుకలు నిర్వహించారు. ఆలయ పూజారి వితపు నాగేంద్ర శర్మ శ్రీదేవి భూదేవి సమేత తిరుమలనాథ స్వామి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

కనిగిరి రూరల్: రథ సప్తమి వేడుకలను శనివారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. రథ సప్తమి సందర్భంగా స్థానిక వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామికి విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. దేవతా మూర్తులను సప్త వాహనాల్లో విశేష పూల అలంకరణలతో, మేళ తాళాలతో, కోలాట భజనలతో పట్టణ పుర వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. వాహనదాతలు దేవకి సుబ్రహ్మణ్యం, భాగ్యలక్ష్మి దంపతులు, రాజీవ్, బిందు మాలిని దంపతులు, బాలకృష్ణా, దేవిఆషిక దంపతులు ప్రత్యేక పూజలు చేసి, శేష వాహనాలను ప్రారంభించారు. అధ్యక్ష, కార్యదర్శులు గోనుగుంట గోపాల్, నార్లపాటి సాంబా,వాగిచర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌ఫెయిర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు అర్బన్: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయం నిర్వహించనున్న మెగా జాబ్ ఫెయిర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మెగా జాబ్ ఫెయిర్‌లో మల్టీనేషనల్ కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఐటీ, నాన్‌ఐటీ, ఫార్మా, సేల్స్ రంగాలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాలకొండ ఆదాయం రూ.10,67,401

వలేటివారిపాలెం: మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదాయం శనివారం రూ.10,67,401 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన ద్వారా రూ.24,040, తలనీలాలు రూ.51,275, ప్రత్యేక దర్శనం రూ.2,76,500, లడ్డుప్రసాదాలు రూ.1,64,115, అన్నదానం రూ.4,50,031, రూమ్‌అద్దెలు రూ.32,280 వచ్చినట్లు తెలిపారు.

సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ

గుడ్లూరు: పంటల్లో సస్యరక్షణ చర్యలతో తెగుళ్లను నివారించవచ్చని వ్యవసాయాధికారి పి.రవికుమార్ అన్నారు. మండలంలోని సాలిపేటలో వీఏఏ, వీహెచ్ఏలకు శనివారం పొలంబడి నిర్వహించారు. రసాయన మందుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడేలా రైతులకు సూచించాలన్నారు. వరిలో కిటకాల నివారణకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. 16 సచివాలయాల వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

రూ.40 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణం



సీసీరోడ్లకు భూమిపూజచేస్తున్న ఎంపీపీ, సర్పంచ్, నాయకులు

పామూరు: గ్రామాల్లో ప్రాధాన్యతా క్రమంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు ఎంపీపీ గంగసాని లక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుస్సేన్‌రెడ్డి అన్నారు. పామూరు రెండో సచివాలయం పరిధిలోని ఎస్టీకాలనీలో, 3వ సచివాలయం పరిదిలోని ఎర్రచేలు ప్రాంతంలో శనివారం సాయంత్రం రూ..40 లక్షల సచివాలయ నిధులతో అంతర్గత సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అల్లూరి రాగమ్మ, పార్టీ యూత్ మండల అధ్యక్షుడు యాదాల వెంకట సాయికిరణ్, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు చాంద్‌బాషా, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, జె.గోవిందయ్య, రత్నకుమార్, రవికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందిని అభినందించిన ఎస్పీ

పీసీపల్లి: ఆరేళ్ల క్రితం జరిగిన బస్సు ప్రమాదం కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన కనిగిరి, పీసీపల్లి పోలీస్ సిబ్బందిని ఎస్పీ మలికా గర్గ్ అభినందించారు. వివరాల్లోకి వెళితే..కరేడు గ్రామానికి చెందిన పీవీఎస్ఎస్ స్కూల్ విద్యార్థులు 2017లో మహానంది టూర్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా పీసీపల్లి అలవలపాడు బ్రిడ్జి వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో పలువురు విద్యార్థులకు గాయాలు కాగా, ఒక విద్యార్థి మరణించాడు. స్కూల్ యాజమాన్యం, డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగింది. దీనిపై అప్పటి కనిగిరి సీఐ సుబ్బారావు నిందితులను అరెస్టు చేసి కందుకూరు ఏఎస్‌జే కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. సదరు కేసు విచారణ కందుకూరు అడిషినల్ కోర్టులో జరిగింది. సాక్ష్యులను విచారించిన అనంతరం షేక్ కాలేషా, మన్నం బ్రహ్మయ్యలపై నేరం రుజువు కావడంతో ఈ నెల 27న నిందితులకు జైలుశిక్ష విధించారు. కేసులో దాదాపు 73 మంది సాక్షులను త్వరతగతిన కోర్టులో హాజరుపరిచి సమర్థవంతగా ట్రయిల్ మానిటరింగ్ చేసి నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన కనిగిరి సీఐ బి.పాపారావు, పీసీపల్లి ఎస్సై ఏ నాగేశ్వరరావు, బి.గోవిందరాజు, కోర్టు కానిస్టేబుల్ కేటీ నాయుడు, ఎల్ బ్రహ్మయ్యలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

స్థలం కేటాయించాలని వినతి

పామూరు: శ్మశాన స్థలం కేటాయించాలని కోరుతూ పాస్టర్ సంఘ నాయకులు సీహెచ్ సుకుమార్, ఆనంద్‌జోసఫ్ ఆధ్వర్యంలో శనివారం ఎంపీపీ గంగసాని లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ స్థల పరిశీలన చేయించి శ్మశానం కోసం కేటాయింపునకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

350 మందికి వ్యాక్సిన్

పామూరు: పామూరులో రెడ్‌క్రాస్ సొసైటీ, సెయింట్‌మార్క్స్‌స్కూల్ ఆధ్వర్యంలో శనివారం పాఠశాలల్లోని 350 మంది విద్యార్థులకు టైఫాయిడ్ వ్యాక్సిన్ నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ, పాఠశాల సీపీ యం.జయకుమార్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రభలుతున్న తరుణంలో టైఫాయిడ్ వ్యాక్సిన్ ఎంతో ఉపకరిస్తుందన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన కనకారావు



ఎమ్మెల్యేతో చర్చిస్తున్న కనకారావు

కందుకూరు అర్బన్: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డిని పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కొమ్మూరి కనకారావు శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఈ నెల 30వ తేదీ లోగా నియమించాల్సిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల నియామకాలు, ఫిబ్రవరి 1వ తేదీ గృహ సారథుల శిక్షణ సమావేశాల గురించి చర్చించారు.

ఈ క్రాప్ తప్పనిసరి



శనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

లింగసముద్రం: రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి సుధాకరరాజు అన్నారు. మండలంలోని వీఆర్‌కోట, రాళ్లపాడు గ్రామాల్లో కందుకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు ముత్యాల శేషగిరిరావుతో కలిసి శనగ పంటను పరిశీలించారు. శనగ పంటవేసి నెల రోజులు కావడంతో చీడపీడల సస్యరక్షణ చర్యల గురించి రైతులకు సూచనలిచ్చారు. ఈ క్రాప్ చేసుకుంటే ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. ఏఓ అబ్రహం లింకన్ వీఏఏ రేణుక, రైతులు పాల్గొన్నారు.